# 'ఓపెన్ యూనివర్సిటీ'

'కథ'

ఎమ్మెస్సార్ మూర్తి

**వ్యక్తి మనుగడ, మానవ జీవన వనరుల దృష్ట్యా కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలు కలసి మరో వినూత్న సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఓపెన్ యూనివర్సిటీ) నెలకొల్పనున్నవి.**



మానవ జీవన వనరుల వ్యవస్థీకరణ దీనిలో ప్రధాన సిద్ధాంతం. తొలి విడతగా మానవ జీవన సాంకేతిక విద్య (హ్యూమన్ బయో-టెక్నాలజీ) కోర్సును ప్రవేశపెట్టనున్నది. దీని పాఠ్య ప్రణాళిక (సిలబస్) అనుబంధం 'అ'లో ఉన్నది.

2. అధికార-అనధికార పదవులన్నీ ఈ కోర్సులో ఉత్తీర్ణులయిన వారికే ఇవ్వబడతాయి. నిర్ణీత కాలంలో కోర్సును పూర్తి చేయలేని వారు పదవులు దిగవలసి ఉంటుంది.

3. కనీస విద్యార్హతలు - లేవు.

వయోపరిమితి - లేదు.

4. పరీక్షలు నిర్ణీత సమయాలలో నిర్ణీత స్థలాల్లో జరుగుతాయి. అభ్యర్థులకు ప్రశ్న పత్రం, జవాబు పత్రాలు ఇవ్వడం వరకే జరుగుతుంది. పరిశీలకులు ఎవరూ ఉండరు. కాలవ్యవధి లోపల అక్కడ ఉన్న ట్రే లేదా బుట్టలో అభ్యర్థులు తమ జవాబు పత్రాలను వేయాలి.

5. పరీక్ష అనంతరం జవాబు పత్రాలు నంబర్లు మార్చి అభ్యర్థులకే పంపబడతాయి. అంటే అభ్యర్థులే పరిశీలించి మార్కులు వేస్తారు. పత్రాలు పరిశీలించే మౌలిక విధానాలు, పద్ధతులు సూచించబడవు.

6. పరీక్షా విధానం : ఒక్కొక్క పేపరుకు 200 మార్కుల చొప్పున సంప్రదాయ ప్రశ్నలతో నాలుగు పేపర్లు, ఆ తర్వాత 200 మార్కులతో ఇంటర్వ్యూ. (ఇంటర్వ్యూ బోర్డులోనూ అభ్యర్థులే ఉంటారు) మాదిరి ప్రశ్న పత్రం అనుబంధం 'ఇ'లో ఇవ్వబడింది.

7. సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎక్కడ ఉండవలసిందీ ఇంకా నిర్ణయం కాలేదు. అభ్యర్థులు, తదితర పౌరులు ఇచ్చిన సూచనల మేరకు త్వరలో నిర్ణయం తీసుకోబడుతుంది. సూచనలు ఏ పత్రికా సంపాదకునికైనా పంపవచ్చు. కవరు మీద స్పష్టంగా "సార్వత్రిక విశ్వవిద్యాలయం - సూచనలు." అని

వ్రాయడం మంచిది.

**అనుబంధం 'అ'**

**మొదటి పేపరు:**

1. మన దేశం - విదేశాలతో సంబంధాలు.

2. ప్రజలు : దేశం, రాష్ట్రం, జిల్లా, కుటుంబం, వ్యక్తి.

3. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు నిధుల సేకరణ - వ్యయం.

4. వివిధ వ్యాపారాలు - వాటి దృక్పథాలు - లాభాలు.

5. స్వచ్ఛంద సేవా సంఘాలు - నిధుల సేకరణ వినియోగం.

6. పరిపాలన - సచివాలయాలు - ఇతర కార్యాలయాలు.

7. ఆడిట్ పద్ధతులు.

8. ఎన్నికలు.

**రెండవ పేపరు:**

1. మనిషి మనుగడకు కావలసిన వస్తు సముదాయం- వాటి సమీకరణ విధానాలు.

2. సంప్రదాయ వేతనాలు - పెన్షను - ప్రావిడెంటు ఫండు.

3. లంచాలు : థీరీ అండ్ ప్రాక్టీస్.

4. మానవ సంబంధాలు - వినోదాలు.

5. పెళ్లి : కట్నం కాన్సెప్ట్.

6. ఆస్తి - ఆస్తుల సమీకరణ - పన్నుల బెడద.

**మూడవ పేపరు:**

1. "సత్యమేవ జయతే" నిరూపణా విధానాలు.

2. ఆస్తిక, నాస్తిక సంప్రదాయాలు- లాభనష్టాలు.

3. మతాల సారం- వాటి వినియోగం, దుర్వినియోగం.

4. మానసిక శారీరక ఆరోగ్యాలు- చికిత్స విచికిత్స విధానాలు, పరిణామాలు.

5. సంగీత, సాహిత్య, నృత్య, నాటక, సినిమా, టీవీ తదితర కళారంగాలు- దైనందిన జీవితంలో వాటి పాత్ర.

6. విద్య - అవిద్య. విద్యలో అవిద్య, అవిద్యలో విద్య - కూటి కోసం కోటి విద్యలు.

**నాల్గవ పేపరు:**

సెల్ఫ్ ఎసెస్‌మెంట్ (స్వకీయ నిరూపణ)

**అనుబంధం (ఇ)**

**మాదిరి ప్రశ్న పత్రాలు :**

గమనిక : ప్రశ్నలన్నీ ఇదే విధంగా ఉంటాయని కాదు. అసలు ఉత్తరోత్తరా జరుపబడే పరీక్షలకు ప్రశ్నలు అభ్యర్థుల నుండే సేకరించి ఒక క్వొశ్చన్ బాంక్ (ప్రశ్నల బాంకు) తయారు చేయబడుతుంది. ప్రశ్నలు పంపదలచుకున్నవారు 7వ నంబరు సూచనను చదవండి.

ప్రతి పేపరులోను 5 ప్రశ్నలకి జవాబు చాలు. పరీక్ష వ్యవధి నాలుగు గంటలు.

**మొదటి పేపరు :**

1. దేశభక్తి అంటే ఏమిటి? మీకు దేశభక్తి ఉందని ఏ ప్రమాణాలతో నిరూపించుకుంటారు?

2. కేంద్రస్థాయిలో పేరు సంపాదించడానికి మీరు వేసుకున్న పథకం నమూనా ఇవ్వండి.

3. రాష్ట్ర ప్రభుత్వంలో ఏ శాఖకు ఎక్కువ బడ్జెట్ ఉంది? దానిలో ఎంత శాతం ఎలా సద్వినియోగపరుచుకోవాలో ఆ శాఖమంత్రిగా అంచనా వేయండి.

4. 'హవాలా' విజయవంతం కావడానికి కారణాలు, పతనానికి దారి తీసిన పరిస్థితులు వివరించండి?

5. ప్రభుత్వ జీ.వో.లు ఎన్ని రకాలు? అటు ప్రభుత్వానికీ, ఇటు దాని నుండి లబ్ధి పొందేవారికి ఎటుపడితే అటు వీలునుబట్టి సమన్వయించు కోగల ఒక జీ.వో. (ముసాయిదా) తయారు చేయండి.

6. ఇంతకు ముందెన్నడూ లేని ఒక స్వచ్ఛంద సేవా సంస్థను గుర్తించి, స్థాపనా విధానాన్ని తెలిపి, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు గ్రాంట్ల నిమిత్తం దరఖాస్తు రాయండి.

7. రాజకీయ నాయకులు, పత్రికాధిపతులు ఎన్నికల సమయాలలో ప్రజల మనస్తత్వం కనుక్కోవడానికి ఆశ్రయించవలసిన రాజకీయ, సామాజిక, మానసిక, ఆధ్యాత్మిక తత్వాలను స్థూలంగా వివరించండి.

**రెండవ పేపరు :**

1. (అ) మీకు ఎంత పెద్ద ఇల్లు కావాలి? దానికి ఏ వయస్సులో సంకల్పం చేస్తారు? ధనాన్ని ఎలా సంపాదిస్తారు? కట్టుబడి ఎలా చేయిస్తారు?

(లేదా)

(ఆ) మీరు ఇదివరకే స్వయంగా ఇల్లు కట్టి ఉన్నట్లయితే ఎలా కట్టగలిగారు?

(లేదా)

(ఇ) మీరు ఇల్లు ఇక కట్టలేము అనుకుంటే ఇల్లు కట్టడం పట్ల మీ పిల్లలకు ఇచ్చే పథకం ఏమిటి?

2. (అ) స్త్రీ శక్తి - పురుషాధిక్యత గురించి చర్చించే వ్యక్తుల ఆర్థిక వ్యవస్థ, దృక్పథాలు ఏమిటో వివరించండి?

(లేదా)

(ఆ) ఎమ్.సి.పి (మేల్ షివోనిస్ట్ పిగ్) అంటే ఏమిటో వివరించి, వారి ఆర్థిక దృక్పథాలు ఉటంకించండి?




3. లంచం బాగా వచ్చే ఓ ఉద్యోగం ఎన్నుకుని అక్కడ లంచం తీసుకోకపోతే వచ్చే కష్టనష్టాలను గానీ, పొందే సుఖసంతోషాలను గానీ వివరించండి.

4. (అ) మీరు కట్నం తీసుకుని ఉంటే - ఎంత కాలంలో దాన్ని ఎలా వినియోగించారో లెక్క రాయండి.

(లేదా)

(ఆ) తీసుకోకపోయినట్లయితే ఎందుకు తీసుకోనవసరం లేకపోయిందో నిరూపించండి/ ఇవ్వకపోతే ఎందుకు ఇవ్వనవసరం లేకపోయిందో నిరూపించండి.

(లేదా)

(ఇ) ఇంకా పెళ్లి కాకపోతే కట్నాలు ఎందుకు తీసుకోవాలో /ఇవ్వాలో విశ్లేషించండి.

5. ధనాన్ని గుప్తంగానూ, నల్లగానూ ఉంచడానికి తీసుకోవలసిన ప్రధాన జాగ్రత్తలు ఏమిటి?

6. 'ఇంగిత జ్ఞానం' అంటే ఏమిటో నిర్వచించండి. ప్రభుత్వంపట్ల ప్రజలకు, ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉండవలసిన ఇంగిత జ్ఞానం విశదీకరించండి.

7. సినిమా, టీవీ పరిశ్రమల్లోని 'గ్లామర్'- తద్వారా వస్తున్న ఉత్పాదనలోని 'లేని గ్లామర్' పోలుస్తూ సమగ్ర వ్యాసం రాయండి.

**మూడవ పేపరు:**

1. "సత్యమేవ జయతే" అంటే ఏమిటి?

ఈ విధానాన్ని ఎన్నుకున్న ఒక వ్యక్తి జీవిత సరళిని వివరించి, అదే పంథాను ఎంతమంది స్వప్రయోజనాలకు వాడుకున్నారో రాయండి.

2. (అ) ఒక గజదొంగకి హోమ్ మినిస్టర్‌గా అవకాశం వస్తే అతని మనస్థితిని ఎలా ఉంటుంది?

(లేదా)

(ఆ) ఒక హోమ్ మినిస్టర్ సివిల్/క్రిమినల్ నేరం చేయవలసిన అవసరం వస్తే అతని మనస్థితి ఎలా ఉంటుంది?

3. (అ) కృత్రిమ సావనీర్ ప్రచురణలు ధన సేకరణ విధానాలకి ఎలా ఉపయోగిస్తాయో రాసి సావనీర్ ప్రచురణా ప్రక్రియ తెలపండి.

(లేదా)

(ఆ) "అభిమాన సంఘాలు నిర్వహించలేని కీలక పాత్ర లేదు"- విశ్లేషించండి.

4. ప్రస్తుత పరిస్థితులు ఒక కొత్త మతాన్ని ప్రవేశ పెట్టడానికి అనుకూలమా? అయితే ఆ మతం ప్రాథమిక సూత్రాలను రూపొందించండి.

5. 'సంపూర్ణ నీతి చంద్రిక'లోని వివిధ కథల్లో మిమ్మల్ని మీరు ఏ కథలో ఏ జంతువు/పక్షితో ఎందుచేత పోల్చుకోవచ్చో నిరూపించండి.

6. నగరంలోని, ఇతరత్రా - స్కూళ్లలో డొనేషను కట్టే విధానాలను ఒక పాఠ్యాంశంగా ఏ తరగతిలో ప్రవేశపెడితే ఆ విద్యార్థి రేపటి పౌరుడిగా తన బాధ్యతలను విస్మరించకుండా ఉండగలడు? పాఠ్యాంశం రూపొందించండి.

7. "అన్ని వృత్తులూ, సామాన్య మానవుడిని దోచే కుట్రలు" అంటాడో ప్రఖ్యాత రచయిత. మరి రచయిత తన వృత్తిలో స్వయంగా చేస్తున్న కుట్ర ఏదైనా ఉందేమో గమనించి విశదీకరించండి. ●